






ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 270 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | గురువారం 01 మే 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


### పహల్గాంలో కొన్ని రోజుల ముందునుంచే పాగా..

# నాలుగు చోట్ల రెక్కీలు...!

**పహల్గాంలోని బైసరన్ లోయలో దాడి చేయడానికి ముందే.. ముష్కరులు పలుచోట్ల రెక్కీ నిర్వహించినట్లు తేలింది.**

మే 1, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రవాదులు కొన్ని రోజుల ముందునుంచే పాగా వేసి.. పక్కా ప్రణాళికతో దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఏప్రిల్ 22 ఘటన అనంతరం దర్యాప్తు బృందాలు టెర్రరిస్టులకు క్షేత్ర స్థాయిలో సహకరించిన ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశాయి. వీరిలో ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. దర్యాప్తు బృందంలో భాగమైన సీనియర్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాదులు ఏప్రిల్ 15వ తేదీనే పహల్గాంకు చేరుకొన్నారు. ఆ తరువాత వారు నాలుగుచోట్ల రెక్కీలు నిర్వహించారు. వీటిలో బైసరన్ వ్యాలీ, అరు వ్యాలీ, స్థానిక అమ్యూస్మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీ ఉన్నాయి. వీటిల్లో చాలాచోట్ల భద్రతా ఏర్పాట్లు ఉండటంతో వారు దాడులు చేయడానికి వెనుకంజ వేశారు.



ఈ ఉగ్రవాదులకు క్షేత్రస్థాయిలో దాదాపు 20 మంది సహకరించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. వీరిలో చాలామందిని ఇప్పటికే అరెస్టు చేసింది. మిగిలిన వారు నిఘా నీడలో ఉన్నారు. మహారాష్ట్రలోని జాల్నాకు చెందిన పర్యాటకుడు ఆదర్శ్ రౌత్ ఇటీవల కాశ్మీర్ పర్యటనకు వెళ్లగా.. తాను పహల్గాం దాడికి ముందురోజు అక్కడే ఒక అనుమానిత వ్యక్తితో మాట్లాడినట్లు వెల్లడించారు. ఎన్ఐఏ విడుదల చేసిన ఉగ్రవాదుల ఊహాచిత్రాలను చూశాక తన అనుమానం మరింత బలపడినట్లు తెలిపారు. ఇలాంటి అనుభవాన్ని పుణేలో స్థిరపడిన మలయాళ సామాజిక వేత్త కూడా వెల్లడించారు. తాము బేతాబ్ వ్యాలీలో తీసిన వీడియోలో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు రికార్డైందని వెల్లడించారు. ఉగ్రవాదులకు సాయం చేసిన క్షేత్రస్థాయిలోని సానుభూతిపరులే అత్యంత కీలక పాత్రను పోషించినట్లు నిఘా సంస్థలు చెబుతున్నాయి. వీరే వారికి అవసరమైన సమాచారం, ప్రయాణ ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. ఉగ్రదాడికి ముందు ఈ ప్రాంతంలో రెండు శాటిలైట్ ఫోన్లు వాడిన సంకేతాలను దర్యాప్తు బృందాలు గుర్తించాయి. మొత్తం 2,500 మందిని ఈ దాడికి సంబంధించి ప్రశ్నించాయి. వీరిలో 186 మంది ఇప్పటికీ దర్యాప్తు బృందాల కస్టడీలో ఉన్నారు.

## అమరావతి పునఃప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి:ఏపీ మంత్రులు

అమరావతి పునఃప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏపీ మంత్రులు తెలిపారు.

అమరావతి, మే 1, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏపీ మంత్రులు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రులు మాట్లాడారు. రాజధాని కోసం అమరావతి ప్రాంత రైతులు చేసిన త్యాగం మరువలేనిదని మంత్రి నారాయణ అన్నారు. రాజధాని పునఃప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు వారిని స్వయంగా ఆహ్వానించారని చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం 3.20 గంటలకు ప్రధాని మోదీ అమరావతికి చేరుకుంటారని ఆయన తెలిపారు. అమరావతి పునఃప్రారంభోత్సవం కోసం సభా ప్రాంగణం పూర్తయిందని మంత్రి పయ్యావల కేశవ్ తెలిపారు. పార్కింగ్కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. రాజధాని కార్యక్రమం మనది అనే భావన అందరికీ వచ్చిందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సభకు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకెళ్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.



## తెలంగాణలో కులగణన తూతూమంత్రమే:కిషన్ రెడ్డి

**బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.**

**స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు.**

దిల్లీ, మే 1, (రిపబ్లిక్ న్యూస్): బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. "2011 జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగపడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్లో.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు" అని కిషన్రెడ్డి ఆరోపించారు.



# 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**రాష్ట్రంలో తొలిదశలో పూర్తిచేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు.**

ఆత్మకూరు, మే 1, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలో తొలిదశలో పూర్తిచేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నారంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్గా ప్రారంభోత్సవం చేశారు. రూ.216 కోట్లతో ఈ 11 పార్కులను ప్రభుత్వం పూర్తిచేసింది. దీంతో పాటు మరో 39 ఎంఎస్ఎంఈ పార్కులను రూ.376 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. పూర్తయిన పార్కులు అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పాణ్యం, డోన్, ఆత్మకూరు(నారంపేట), దర్శి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఉన్నాయి. వీటితో పాటు రాంబిల్లిలోని ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ న్ను (ఎఫ్ఎఫ్సీ) సీఎం ప్రారంభించారు. 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



**ఆత్మకూరు, మే 1, (రిపబ్లిక్ న్యూస్):**
**దేశంలో అసంఘటిత కార్మికులే అధికమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు అసంఘటిత కార్మికులు అనేక కష్టాలు పడ్డారని చెప్పారు. మేడే సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.**

## అమరావతిలో భూముల విలువ పెరిగింది:సీఎం చంద్రబాబు

దేశంలో అసంఘటిత కార్మికులే అధికమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.



"ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ. వేలకోట్ల ఆదాయం వస్తుంది. ఆ ఆదాయాన్ని వదులుకుని మరీ.. ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నాం. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం.. నాలా చట్టాన్ని రద్దు చేశాం. కార్మికుల కోసం కర్నూలు, గుంటూరులో వందపడకల ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. ఆంధ్ర యువతకు ఉపాధి కల్పించడానికి అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నాం. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి కొంతభాగం వారికి ఇస్తున్నాం. ఆ రైతులను కోటీశ్వరులుగా మారుస్తున్నాం. ఇప్పుడు రాజధానిలో భూముల విలువ పెరిగింది. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తాం. అభివృద్ధి జరుగుతుంటే సహించలేనివారు ఉన్నారు" అని చంద్రబాబు అన్నారు.

## కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు:సీఎం రేవంత్ రెడ్డి

మాజీ సీఎం కేసీఆర్ రూ.8.15 లక్షల కోట్లు అప్పు చేసి పదవి దిగి వెళ్లిపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ డబ్బులన్నీ ఎక్కడికి పోయాయో ఆనవాళ్లు తెలియడం లేదన్నారు.

**హైదరాబాద్, మే 1, (రిపబ్లిక్ న్యూస్): మాజీ సీఎం కేసీఆర్ రూ.8.15 లక్షల కోట్లు అప్పు చేసి పదవి దిగి వెళ్లిపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ డబ్బులన్నీ ఎక్కడికి పోయాయో ఆనవాళ్లు తెలియడం లేదన్నారు. కేసీఆర్ చేసిన అప్పుల వడ్డీలు చెల్లించేందుకే రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన మే డే వేడుకల్లో సీఎం రేవంత్రెడ్డి పాల్గొన్నారు.**



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కేసీఆర్ రూ. లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే.. అది మూడేళ్లకే కూలిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1000 గ్యాస్ సిలిండర్ను రూ.500కే ఇస్తున్నాం. తొలి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన నాటికి మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రూ.8.15 లక్షల కోట్ల అప్పుల్లోకి ఎందుకు పోయింది? రాష్ట్రం అప్పులపాలయితే.. కేసీఆర్ కుటుంబానికి పత్రికలు, ఛానెళ్లు, ఫామ్ను ఎలా వచ్చాయి? కనీసం ధర్నా చౌక్ లో నిరసన తెలిపే హక్కు లేకుండా దాన్ని మూసివేశారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా మన కోర్సులు లేవు. వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలని నిర్ణయించాం. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రభుత్వానికి ప్రతినెలా రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తోంది. గత ప్రభుత్వం చేసిన అప్పులపై కిస్తీలకు రూ.6 వేల కోట్లు పోతోంది. ప్రతి నెలా ఉద్యోగుల జీతభత్యాలకే రూ.6 వేల కోట్లు పోతోంది. ప్రతి నెలా రూ.22 కోట్లు వేల కోట్లు వస్తే తప్ప.. ప్రభుత్వ కనీస అవసరాలు తీరవు. సర్పంచ్లకు బకాయిలు గత ప్రభుత్వం పెట్టిపోయిందే. ఎక్కడ దొరికితే అక్కడ అడ్డగోలుగా అప్పులు తెచ్చారు. ఆర్థికంగా ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంటే.. కొత్త డిమాండ్లు చేస్తే ఎలా? ఏమైనా సమస్యలుంటే కూర్చొని పరిష్కరించుకుందాం. ఉట్టి తెగిపడాలని మాజీ సీఎం రోజూ శాపనార్థాలు పెడుతున్నారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదని మాజీ సీఎం గుర్తుంచుకోవాలి. కపట నాటక సూత్రధారి మళ్లీ బయటకు వచ్చాడు.. నమ్మి మోసపోవద్దు" అని సీఎం చెప్పారు.

## ఉపాధి హామీ పథకం దేశానికి ఒక వరం:డిప్యూటీ సీఎం పవన్

**ఉపాధి హామీ పథకం రాష్ట్రం, దేశానికి ఒక వరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని సి. కె. కన్వెన్షన్ హాలులో మేడే ఉత్సవాలు నిర్వహించారు.**

మంగళగిరి, మే 1, (రిపబ్లిక్ న్యూస్): ఉపాధి హామీ పథకం రాష్ట్రం, దేశానికి ఒక వరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని సి. కె. కన్వెన్షన్ హాలులో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ శ్రామికులతో పవన్ కల్యాణ్ ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్రాభివృద్ధికి వెన్నెముకగా మారిందన్నారు. సుమారు 75 లక్షల 23 వేల మంది శ్రామికులు సొంత గ్రామాల్లోనే ఉపాధి పొందుతున్నారని చెప్పారు.



గత ఆర్థిక సంవత్సరంలోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రూ.10,669 కోట్లు ఖర్చు చేశామన్నారు. కేవలం వేతనాలకే రూ.6,194 కోట్ల వ్యయం అయిందని వివరించారు. మెటీరియల్ కింద రూ.4,023 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. "పల్లె పండుగలో భాగంగా ఇప్పటికి రూ.377.37 కోట్లతో 21,564 గోకులాలు పూర్తి చేశాం. దీని వల్ల ప్రతి రైతుకు నెలకు రూ.4,200 అదనపు ఆదాయం వస్తోంది. రక్తం ధారపోసి పనిచేసేవారు లేకపోతే ఏ నిర్మాణం జరగదు. ఉపాధి కూలీలను ఉపాధి శ్రామికులుగా పిలుద్దాం. మిగతా వృత్తుల్లో ఉన్నవారిలాగే ఉపాధి శ్రామికులు కూడా గొప్పవారే. వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్ను అప్పుల పాల్జేశారు. మద్య నిషేధమంటూ వచ్చి గత ప్రభుత్వం వ్యాపారం చేసింది. మద్యం కుంభకోణానికి పాల్పడి రూ.3,200 కోట్లు కొల్లగొట్టారు. వైకాపా ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన పరిస్థితుల్లో పంచాయతీరాజ్ నిధులు రాష్ట్రానికి ప్రాణవాయువు అయ్యాయి" అని పవన్ కల్యాణ్ వివరించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ శ్రామికులకు ప్రధానమంత్రి జీవిత బీమా కల్పించినట్లు పవన్కల్యాణ్ తెలిపారు. వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల జీవిత బీమా లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే వచ్చే పరిహారాన్ని రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఈ మేరకు పవన్ సమక్షంలో ఎస్బీఐతో పంచాయతీరాజ్ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.

## మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా? :పహల్గాం ఘటనపై విచారణకు సుప్రీం తిరస్కరణ

దిల్లీ, మే 1, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో ఇటీవల ముష్కరులు జరిపిన పాశవిక దాడితో యావత్ దేశం ఉలిక్కిపడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని దేశమంతా ఒక్కటైంది. ఈ నేపథ్యంలో పహల్గాం దాడి పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయ-స్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని కోర్టు పిటిషనర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. "ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? మీక్కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు" అని ధర్మాసనం సూచించింది. "ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దు. ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారు" అని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి గట్టిగా బదులిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఆ సంస్కృతిని గుడ్డిగా అనుసరిస్తున్నారు: రజనీకాంత్

యువతకు మన సంస్కృతి గొప్పతనం తెలియడం లేదన్నారు రజనీకాంత్. పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుసరిస్తున్నారని చెప్పారు.



సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక అభిమానులను సొంతం చేసుకున్నారు స్టార్ హీరో రజనీకాంత్. నటనలోనే కాదు.. ఆయన వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక ప్రయాణం కూడా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది. రజనీ ఎప్పుడూ మన సంస్కృతి, విలువలపై ఆయన ఆలోచనలను పంచుకుంటూ ఉంటారు. తాజాగా తన భార్య లత నిర్వహించిన ఓ సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి యువత పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుసరిస్తున్నారన్నారు. “ఈ మొబైల్ యుగంలో యువతకు, కొందరు పెద్దలకు మన దేశ సంప్రదాయాల గురించి తెలియడం లేదు. వారంతా భారతదేశ గొప్పతనం, వైభవం గురించి తెలుసుకోకుండా పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుసరిస్తున్నారు. విదేశీయులు వారి సంప్రదాయాల్లో ఆనందం, శాంతిని కనుగొనలేకపోవడం వల్లే మనదేశం వైపు మొగ్గు చూపుతున్నారు. ధ్యానం, యోగా ద్వారా ఆనందాన్ని, శాంతిని కనుగొన్నారు. దీనిపై అందరికీ అవగాహన కల్పించేందుకు లత ఒక గొప్ప ప్రయత్నం మొదలు పెట్టింది. దేవుడి దయతో ఆ ప్రయత్నం ఫలించాలని కోరుకుంటున్నా” అని అన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. రజనీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘కూలీ’తో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఈ సినిమా రూపొందింది. ఇందులో నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకురానుంది.

# "హిట్ 4" హీరో అతడేనా... అతిథి పాత్రలో మెరిసిన స్టార్ హీరో

నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘హిట్ 3’. తాజాగా ఇది ప్రేక్షకుల ముందుకువచ్చింది.



‘హిట్’ యూనివర్స్‌లో భాగంగా విడుదలైన తాజా చిత్రం ‘హిట్ 3’. నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వం వహించారు. ఇందులో కోలీవుడ్ నటుడు కార్తి అతిథి పాత్రలో నటించారంటూ ఎంతోకాలం నుంచి వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. గురువారం ‘హిట్ 3’ విడుదల కావడంతో ఆయా వార్తలకు క్లారిటీ లభించింది. కొంతకాలంగా జరుగుతోన్న ప్రచారాన్ని నిజం చేస్తూ సినిమా క్లైమాక్స్ కార్తి కనిపించారు. రత్నవేల్ పాండియన్ అనే పోలీస్ అధికారిగా ఆయన స్క్రీన్పై కనిపించి ప్రేక్షకులను మెప్పించారు. “దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్” అంటూ శ్రీ గురజాడ అప్పారావు చెప్పిన కవిత్వాన్ని తన స్టైల్లో చెబుతూ ఆయన ఎంట్రీ ఇచ్చారు. కార్తి ఎంట్రీకి సంబంధించిన వీడియోలను సోషల్మీడియాలో షేర్ చేసిన నెటిజన్లు.. అదిరిందంటూ కామెంట్స్ పెడుతున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఇలాంటి ప్రవర్తనను ఎవరైనా అనుమతిస్తారా? :ఆ యాక్సిడెంట్ పై జాన్వీ సీరియస్ పోస్ట్

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్గా ఉంటారు నటి జాన్వీకపూర్. సమాజంలో జరుగుతోన్న విషయాలపై తన అభిప్రాయాన్ని తెలుపుతుంటారు. తాజాగా జైపుర్లో జరిగిన ఓ యాక్సిడెంట్ పై జాన్వీ సీరియస్ పోస్ట్ పెట్టారు. ఓ మహిళ మద్యం మత్తులో కారు నడుపుతూ బైక్ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై జాన్వీ స్పందిస్తూ మద్యం కారణంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని విచారం వ్యక్తంచేశారు.



“ఇలాంటి నిర్లక్ష్యపు ప్రవర్తనను ఎవరైనా అనుమతిస్తారా?. మద్యం తాగి వాహనం నడపడం వల్ల చుట్టూ ఉన్న వారి ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేయడం సరైనది అని ఎవరైనా అనుకుంటారా?. ఈ యాక్సిడెంట్ గురించి తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను. మద్యం కారణంగా జరిగే ప్రమాదాల్లో ఎంతోమంది జీవితాలను కోల్పోతున్నారు. మరెంతోమంది గాయాలపాలవుతున్నారు. చట్టాలను మనం ఎందుకు గౌరవించడం లేదు. కనీస అవగాహన లేకుండా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నాం” అని తన ఇన్స్టాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం జాన్వీకపూర్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. మరికొన్ని రోజుల్లో ‘పరమ్ సుందరి’గా తెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. భాషతో సంబంధం లేకుండా అగ్రతారల సరసన వరుస అవకాశాలతో జోరు మీదున్న ఈ భామ.. తమిళంలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆమె ఖాతాలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న ‘పెద్ది’, ‘సన్నీ సంస్కారి కీ తులసీ కుమారి’ తదితర చిత్రాలు ఉన్నాయి.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/161/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- **1989:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం – మే డే.
- **1707:** ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్లాండ్ దేశాలు కలిసి యునైటెడ్ కింగ్ డం ఆఫ్ గ్రేట్ బ్రిటన్ గా ఏర్పడింది.
- **1751:** మొట్టమొదటి అమెరికన్ క్రికెట్ పోటీ జరిగింది.
- **1913:** కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు పుచ్చలపల్లి సుందరయ్య జననం (మ. 1985). (చిత్రంలో)
- **1960:** గుజరాత్, మహారాష్ట్ర ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి.
- **1971:** భారతీయ నటుడు అజిత్ కుమార్ జననం.
- **1988:** భారతీయ నటి అనుష్క శర్మ జననం.
- **2008:** గాంధేయవాది నిర్మలా దేశ్‌పాండే మరణం (జ. 1929).
- **2009:** మన్యసీమ తెలుగు మాసపత్రిక తొలి ప్రచురణ వెలువడింది.



అంతర్జాతీయ కార్మిక దినోత్సవం



బ్రిటన్




అమెరికన్ క్రికెట్ పోటీ




పుచ్చలపల్లి సుందరయ్య



గుజరాత్, మహారాష్ట్ర



అజిత్ కుమార్



అనుష్క శర్మ



నిర్మలా దేశ్‌పాండే

రిపబ్లిక్ స్పోర్ట్స్

# పంజాబ్ కింగ్స్ సామ్ కరన్ వివాదం!

సామ్ కరన్ ఔటైన తర్వాత పెవిలియన్కు వెళ్తూ... పంజాబ్ కింగ్స్ డగౌట్ వైపు చూస్తూ ఏవో సంజ్ఞలు చేశాడు. ఈ వీడియో వైరల్ గా మారింది. దీంతో కరన్కు పంజాబ్కింగ్స్‌తో ఏదో వివాదం ఉందనే వాదన వినిపిస్తోంది.



ఐపీఎల్ 2025 సీజన్లో భాగంగా బుధవారం పంజాబ్కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్ సందర్భంగా చెన్నై ఆటగాడు సామ్ కరన్ వ్యవహరించిన తీరు నెట్టింట చర్చకు దారితీసింది. గతంలో పంజాబ్ యాజమాన్యంతో అతడికి వివాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు మొదలయ్యాయి.

చెన్నై ఇన్నింగ్స్ 18వ ఓవర్లో సామ్ కరన్ ఔటైన తర్వాత పెవిలియన్కు వెళ్లాడు. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్ డగౌట్ వైపు చూస్తూ ఏవో సంజ్ఞలు చేశాడు. ఈ దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. దీంతో కరన్కు ఆ జట్టుతో ఏదో వివాదం ఉందనే వాదన వినిపిస్తోంది. గతంలో అతడు పంజాబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సీజన్కు ముందు అతడిని కింగ్స్ వదులుకోవడంతో వేలంలో చెన్నై దక్కించుకుంది.


ఈ మ్యాచ్లో కరన్ 47 బంతుల్లోనే 88 పరుగులు చేశాడు. ఈ సీజన్లో అతడికి ఇదే తొలి హాఫ్ సెంచరీ. ఇప్పటివరకు కేవలం నాలుగు మ్యాచుల్లో మాత్రమే ఆడాడు. నిన్నటి మ్యాచ్లో 48 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న చెన్నైను కరన్ తన ఇన్నింగ్స్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే బ్రెవిస్తోతో కలసి 78 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే, అతడి పోరాటం వృథా అయ్యింది. పంజాబ్ చేతిలో చెన్నై ఓటమి పాలైంది. ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ అధికారికంగా ప్లేఆఫ్స్ రేస్ నుంచి నిష్క్రమించినట్లైంది.


## ఆరోగ్యం

# కిడ్నీ క్యాన్సర్ ఉంటే శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి, అలసత్వం వహిస్తే మీకే నష్టం

ఈ రోజుల్లో కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం కూడా ఎక్కువైపోయింది. కిడ్నీ క్యాన్సర్‌ను వైద్య పరిభాషలో రీనల్ సెల్ కార్సినోమా అంటారు. ఈ వ్యాధి యొక్క అతిపెద్ద సవాలు ఏంటంటే, ప్రారంభ దశలో దీని లక్షణాలు చాలా తేలికగా ఉంటాయి లేదా అస్సలు కనిపించవు.

శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కిడ్నీలు శరీరంలో అనేక ముఖ్యమైన విధుల్ని నిర్వహిస్తాయి. రక్తాన్ని క్లీన్ చేయడం, శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్లు తొలగించడం, అదనపు ద్రవాల్ని ఫిల్టర్ చేయడం లాంటి పనుల్ని కిడ్నీలు నిర్వహిస్తాయి. అంతేకాకుండా మూత్రపిండాలు రక్తపోటును నియంత్రించడంలో, ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడంలో, ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడంలో, ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సాయపడతాయి. ఎంతో కీలకమైన కిడ్నీలను జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. అయితే, వేగంగా మారుతున్న జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదముంది. మూత్రపిండాల సంబంధిత సమస్యల్ని గుర్తించే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇక, ఈ రోజుల్లో కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం కూడా ఎక్కువైపోయింది. కిడ్నీ క్యాన్సర్‌ను వైద్య పరిభాషలో రీనల్ సెల్ కార్సినోమా అంటారు. ఈ వ్యాధి యొక్క అతిపెద్ద సవాల్ ఏంటంటే, ప్రారంభ దశలో దీని లక్షణాలు చాలా తేలికగా ఉంటాయి లేదా అస్సలు కనిపించవు. అందుకే దీనిని ‘సైలెంట్ కిల్లర్’ అని పిలుస్తారు. అందుకే కొన్ని సంకేతాల్ని గుర్తించడం చాలా ముఖ్యం. ఆ సంకేతాలు లేదా లక్షణాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.





### మూత్రంలో రక్తం (హెమటురియా)



మూత్ర విసర్జన సమయంలో మూత్రం గులాబీ లేదా లేత ఎరుపు రంగులో ఉంటే ఆ లక్షణం కిడ్నీ క్యాన్సర్‌కు మొదటి సంకేతం కావచ్చు. అయితే, కొన్నిసార్లు ఇది ఇన్ఫెక్షన్ వంటి ఇతర కారణాల వల్ల కూడా రావచ్చు. అయితే, పదే పదే మూత్రం రంగు మారితే మాత్రం అలర్ట్ అవ్వాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదం జరుగుతుంది. అందుకే మూత్రంలో రక్తం కనిపిస్తే అలసత్వం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

### కడుపులో లేదా నడుము దగ్గర గడ్డలు




కడుపులో లేదా నడుము దగ్గర ఏదైనా భాగంలో గట్టిగా గడ్డల్లా ఉంటే ఆ లక్షణం కూడా కిడ్నీ క్యాన్సర్‌కు సంకేతం కావచ్చు. ఈ గడ్డలు కాలక్రమేణా పెరిగితే చాలా ప్రమాదం. అందుకే కడుపు లేదా నడుము దగ్గర ఏదైనా గట్టిగా గడ్డల్లా అనిపిస్తే మీరు నిర్లక్ష్యం చేయకండి. వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన సలహా తీసుకోండి. ఈ లక్షణాలు సాధారణంగా వ్యాధి ముదిరిన తర్వాత కనిపిస్తాయి.

### నడుము నొప్పి




కిడ్నీ క్యాన్సర్ ఉంటే గజ్జల్లో లేదా వీపు వైపున నిరంతర, అసాధారణ నొప్పి చాలా రోజుల పాటు కొనసాగుతుంది. ఇది సాధారణ నొప్పి కంటే చాలా భిన్నంగా ఉంటుంది. ఒక్కోసారి ఈ నొప్పిని తట్టుకోలేరు. ఈ లక్షణం కిడ్నీ క్యాన్సర్‌కి సంకేతం కావచ్చు. ముఖ్యంగా నొప్పి గుచ్చుతున్నట్లుగా తీవ్రంగా ఉంటే జాగ్రత్త. ఒక్కోసారి విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా ఈ నొప్పి తగ్గకపోవచ్చు. పదే పదే ఈ లక్షణం కనపడితే వెంటనే అలర్ట్ అవ్వండి. వైద్యుణ్ని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోండి.

### బరువు తగ్గడం, ఆకలిగా అనిపించకపోవడం




ఎటువంటి కారణం లేకుండా ఆకస్మాత్తుగా బరువు తగ్గితే అలర్ట్ అవ్వండి. అంతేకాకుండా ఏదైనా తినాలనిపించకపోవడం, ఆకలి లేకపోవడం కూడా మంచి లక్షణాలు కావు. ఈ సంకేతాలు శరీరంలో ఏదైనా తీవ్రమైన వ్యాధికి సంకేతం కావచ్చు. మూత్రపిండాల క్యాన్సర్ సమయంలో కూడా ఈ లక్షణాలు కనిపిస్తాయి. అందుకే వీటిని నిర్లక్ష్యం చేయకండి. వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### విపరీతమైన అలసట, రక్తహీనత



మూత్రపిండాలు రక్తాన్ని ఫిల్టర్ చేయడంతో పాటు శరీరంలో ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి చేయడంలో సాయపడతాయి. అయితే, కిడ్నీ క్యాన్సర్ ఉంటే ఈ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. దీని వల్ల రక్తహీనత, తీవ్రమైన అలసట సంభవించవచ్చు. ఈ అలసట సాధారణం కన్నా భిన్నంగా ఉంటుంది. మీరు ఏ పని లేదా శారీరక శ్రమ చేయకపోయినా అలసట, బలహీనత అనిపిస్తే అలర్ట్ అవ్వండి. నిద్ర పోయిన తర్వాత కూడా అలసట అనిపిస్తుంది. ఈ లక్షణాలు పదే పదే కనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వండి.

### తరచుగా జ్వరం



మీకు పదే పదే జ్వరం రావడం, వచ్చిన జ్వరం ఎక్కువ కాలం ఉండటం, జ్వరంతో పాటు ఫ్లూ లాంటి లక్షణాలు ఉంటే అది కిడ్నీ క్యాన్సర్‌కు సంకేతం కావచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు. పూర్తి పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. ఈ లక్షణాలన్నీ ప్రారంభ దశలో కనిపిస్తాయి. మూత్రపిండాల క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తే.. రోగికి రక్తంతో కూడిన దగ్గు, నిరంతర ఎముకల నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిస్తాయి.

**గమనిక**

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.